క్లుప్తంగా

7వ తేదీలోపు రైతుబంధు నమోదు చేయించుకోవాలి

దుండిగల్: ఈనెల 7వ తేదీలోపు రైతుబంధు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు పడుతున్న రైతులు మినహాయించి ఇప్పటి వరకు రైతు బంధు నమోదు చేయించుకోని వారు కొత్తగా నమోదు చేయించుకోవాలన్నారు. పట్టాదార్ పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను మండల వ్యవసాయ కేంద్రంలో అందజేయాలని కోరారు. పత్రాలు సమర్పించని వారికి రైతుబంధు వర్తించదని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ నం.72888 94684లో సంప్రదించవచ్చు.

చెత్తాచెదారాన్ని తొలగించండి


సంజయ్‌గాంధీనగర్ ప్రధాన రోడ్డులోని ఆగ్రా స్వీట్స్ దుకాణం వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కోరుతూ మంగళవారం గాంధీనగర్‌లోని వార్డు కార్యాలయంలో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సంజయ్‌గాంధీనగర్ ప్రధాన రోడ్డులోని ఆగ్రా స్వీట్స్ దుకాణం సమీపంలో గత కొన్ని రోజులుగా చెత్త పేరుకుపోతోంది. దుర్వాసనను భరించలేకపోతున్నామని వెంటనే చెత్తను తరలించాలని వార్డు కార్యాలయంలో అధికారులకు గ్రీవియన్స్ కెటగిరి కింద ఫిర్యాదు అందింది.

దూలపల్లిలో టాటా ఏస్ దగ్ధం


దూలపల్లి చర్మాస్ రోడ్డులో దగ్ధమవుతున్న టాటా ఏసీ వాహనం

సుభాష్‌నగర్: టాటా ఏసీ వాహనంలో మంటలు చెలరేగి కాలిపోయింది. వివరాల్లోకి వెళితే టాటా ఏస్ వాహనం మంగళవారం లోడుతో వెళ్తుండగా దూలపల్లిలోని చర్మాస్ రోడ్డులోని పెట్రోల్ పంపు వద్ద అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ చాకచక్యంగా చర్మాస్ రోడ్డు వైపు వాహనాన్ని తీసుకెళ్లి లోడును కిందికి దింపాడు. అంతలోనే వాహనం ముందు భాగం నుంచి మంటలు చెలరేయి నిమిషాల వ్యవధిలో కాలిపోయింది.

ఐఐహెచ్‌ఎంలో హాస్పిటాలిటీ స్కిల్ కోర్సు ప్రారంభం

గచ్చిబౌలి: అడ్మిషన్ రోజే ఉద్యోగం కల్పిస్తామని ఐఐహెచ్‌ఎం (ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్) చైర్మన్ డాక్టర్ సుబోర్నో బోస్ పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలిలోని ఐఐహెచ్‌ఎం హైదరాబాద్ డైరెక్టర్ ఎర్నెస్ట్ ఇమాన్యుయేల్ పర్యవేక్షణలో వర్చువల్‌గా 'హాస్పిటాలిటీ స్కిల్స్' షార్ట్‌టర్మ్ కోర్సును ప్రారంభించారు. ఆతిథ్య రంగంలో నైపుణ్యం కల్గిన ఉద్యోగుల కొరత ఉందని,ఈ కోర్సులో చేరిన వారికి అదే రోజు ఉద్యోగం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హయత్ కార్పొరేషన్ డైరెక్టర్ మోసం భట్టాచార్య, ప్రముఖ చెఫ్ చలపతిరావు పాల్గొన్నారు.

టీహెచ్‌సీహెచ్‌ఏఏ అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి

భాగ్యనగర్‌కాలనీ: తెలంగాణ హెల్త్ కేర్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అసోసియేషన్ (టీహెచ్‌సీహెచ్‌ఏఏ) ఎన్నికలను మంగళవారం ఆల్విన్‌కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడిగా డా. గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ప్రేమ్, మనోజ్‌రెడ్డి, సభ్యులు శ్రీకాంత్, రాహుల్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, రచన, పల్లవి, హర్ష, జశ్విన్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, హాస్పటల్స్ కార్పోరేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

108కలశాలతో ప్రత్యేక పూజలు

బాలానగర్: డివిజన్ పరిధిలోని శ్రీకళ్యాణినగర్‌లోని శ్రీసాయి నాగేంద్ర ఆలయంలో మంగళవారం 108 కలశాలతో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సద్గురు సాయినాద్ మహరాజ్, నాగేంద్రుడు, నాగమాతకి పూజలు నిర్వహించారు.

చైన్ స్నాచర్ అరెస్టు

బాలానగర్: కంచర్ల జమున అనే మహిళ గత నెల 30వ తేదీన గిరినగర్‌లోని కూరగాయల మార్కెట్‌కు వచ్చి వెళ్తుండగా గురుమూర్తి నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో వి. భానుప్రకాష్ ఆమె మెడలోని 3 తులాల బంగారపు తాడు తెంపుకొని వెళ్లిపోయాడు. ఆమె కింద పడిపోయింది. జమున ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేసి భానుప్రకాష్‌ను అరెస్టు చేసి బంగారు గొలుసును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు బాలానగర్ పోలీసులు తెలిపారు.

రిజిస్ట్రేషన్ల జాప్యంపై తహసీల్దార్ క్లారిటీ

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణ జీఓ.59 దరఖాస్తుల పరిశీలన, నోటీసుల జారీ, వివిధ రకాల సమస్యల పరిష్కారం. డబ్బులు చెల్లించిన వారికి రిజిస్ట్రేషన్ల విషయంలో జరుగుతున్న జాప్యం తదితర విషయాలపై బాచుపల్లి మండల తహసీల్దార్ సురేందర్‌తో సాక్షి ఇంటార్వ్యూ.

– నిజాంపేట్


సురేందర్

ప్రశ్న: ప్రస్తుతం ఏ దరఖాస్తులను పరిశీలన చేస్తున్నారు. ఎన్ని రోజులు గడువు.?

జవాబు: బాచుపల్లి మండలంలోని వివిధ కాలనీల ప్రజలు ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఉండి జీఓ.59కు దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను ప్రస్తుతం పరిశీలన చేస్తున్నాం.

ప్రశ్న: జీఓ.59 కింద ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారు.?

జవాబు: బాచుపల్లి మండలం నుంచి సుమారు 1800 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు.క్షేత్ర స్థాయితో అధికారులు అన్ని పత్రాలను పరిశీలించి దరఖాస్తుల సర్వే పూర్తి చేస్తారు.

ప్రశ్న: గతంలో జీఓ.59 కింద దరఖాస్తు చేసుకుని పూర్తి డబ్బులు చెల్లించిన వారందరికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారా?

జవాబు: గతంతో డబ్బులు చెల్లించిన వారందరికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేశాం. డబ్బులు చెల్లించిన రెండు, మూడు రోజుల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తవుతుంది. మా నుంచి ఎలాంటి జాప్యం లేదు.

ప్రశ్న: నోటీసులు అందుకున్న వారు తమకు ఎక్కువ మొత్తంలో డబ్బులు చెల్లించాలని నోటీసులు వచ్చినట్లు వాపోతున్నారు.? దీనిపై మీ సమాధానం.?

జవాబు: గతంలో 2014 ప్రకారం డబ్బులు చెల్లించాలని నోటీసులు వచ్చాయి. కాని ప్రస్తుతం ఉన్న బేసిక్ వాల్యూ ప్రకారం డబ్బులు చెల్లించాలని ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న వారికి నోటీసులు వచ్చాయి. ప్రభుత్వం పెంచింది.కొంత మందికి రెండు మూడు అంతస్తులు ఉంటే అలాంటి వారికి కమర్షియల్ ప్రకారం నోటీసులు రావడం జరుగుతుంది.

ప్రశ్న: దరఖాస్తుల పరిశీలనకు ఎంత మంది అధికారులు పరిశీలన చేస్తున్నారు?

జవాబు: జీఓ.59 కింద దరఖాస్తు చేసుకున్న వాటిని పరిశీలించడానికి మొత్తం మూడు టీంలను ఏర్పాటు చేశాం. దరఖాస్తుదారులకు అధికారులు ఫోన్ చేసి వారి ఇంటి వద్దకే వెళ్లి పరిశీలన చేస్తున్నారు.

ప్రశ్న: దరఖాస్తు దారులు ఎలాంటి పత్రాలను అధికారులకు చూపించాలి.?

జవాబు: దరఖాస్తుదారులు ఇంటి పన్ను, కరెంటు బిల్లు, వాటర్ బిల్లు లాంటివి 2020లోపు అందులో ఏ ఒక్కటి ఉన్న సరిపోతుంది.

ప్రశ్న: కొంత మంది ఎలాంటి నిర్మాణాలు లేకుండానే జీఓ.59 కింద దరఖాస్తు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.? వాటి పరిస్థితి ఏంటి.?

జవాబు: ఎలాంటి నిర్మాణాలు లేకుండా ఉన్న దరఖాస్తులను రిజెక్టు చేయడం జరుగుతుంది. ఇందులో ఎలాంటి అనుమానం లేదు.

ప్రశ్న: 58 జీవో దరఖాస్తుల పరిశీలన ఎప్పుడు చేస్తారు?

జవాబు: ప్రస్తుతం జీఓ.59 దరఖాస్తుల పరిశీలన జరుగుతుంది. 58 జీవో దరఖాస్తుల పరిశీలనపై ఇంకా తమకు ఆదేశాలు రాలేదు. తమకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పరిశీలన జరుగుతుంది.

ప్రశ్న: గతంలో నోటీసులు అందుకున్న వారు ప్రస్తుతం డబ్బులు చెల్లించడానికి అవకాశం ఉందా?

జవాబు: గతంలో జీఓ.59 కింద నోటీసులు అందుకుని ఇప్పటికి డబ్బులు చెల్లించని వారు. ఇప్పుడు ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తే వెంటనే రిజిస్ట్రేషన్ చేస్తాం. ఇలాంటి అవకాశం ఎప్పుడు వస్తుందో తెలియదు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

అధికారమిస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తాం

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి


వాజ్‌పేయినగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి

రంగారెడ్డినగర్: తెలంగాణ సమాజం మార్పు కోసం ఎదురు చూస్తోందని.. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కుత్బుల్లాపూర్ డివిజన్ దత్తాత్రేయనగర్, పద్మానగర్ ఫేజ్-02, వాజ్‌పేయినగర్, సంజీవయ్యనగర్, బ్యాంక్‌కాలనీ, రింగ్ రోడ్డు ప్రాంతాల్లో స్థానిక సమస్యలపై పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విధివిధానాలు, తమ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు వివరిస్తూ పాదయాత్రను కొనసాగించారు.

◆ భూపతిరెడ్డి మాట్లాడుతూ ఏ లక్ష్యాలతో అయితే ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రజలు పోరాడి సాధించుకున్నారో అవి నెరవేరలేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిరంకుశ పాలనలో రాష్ట్ర ప్రజలు అన్ని విధాలా మోస పోయారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్, ఆర్టీసీ చార్జీలను తగ్గించడంతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఏ-బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, కుత్బుల్లాపూర్ మండల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ ఇన్‌చార్జ్ రాధాకృష్ణ, బౌరంపేట్ మాజీ సర్పంచ్ మిద్దెల యాదిరెడ్డి, ఓబీసీ సెల్ రాష్ట్ర కో.ఆర్డినేటర్ భరత్ గౌడ్, మైనారిటీ సెల్ రాష్ట్ర జాయింట్ కో.ఆర్డినేటర్ సమీర్ ఖాన్ తదితరులు ఉన్నారు.

సుపరిపాలన అందించడమే ప్రభుత్వ ధ్యేయం

సుభాష్‌నగర్: సుపరిపాలన అందించడమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా మంగళవారం ఆయన గాజులరామారం డివిజన్ పరిధిలోని ద్వారక నగర్, చెన్నకేశవ నగర్, మల్లారెడ్డి నగర్ ఫేస్-1 కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిశీలించిన ఆయన వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. స్థానికంగా రూ.3.25 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థలను కల్పించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కాలనీ వాసులు హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో ఈఈ గోవర్ధన్, డీఈఈ రూపాదేవి, డీజీఎం అప్పల నాయుడు, మేనేజర్ రోహిణి, స్థానిక బస్తీలు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నీటి సంపులో పడి సెక్యూరిటీ గార్డు మృతి


మృతి చెందిన యాదయ్య

దుండిగల్: ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఓ సెక్యూరిటీ గార్డు మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా టేక్‌మల్ మండలం బోడాట్‌పల్లి గ్రామానికి చెందిన యాదయ్య(35), అనసూయలు దంపతులు. వీరికి పిల్లలు లేరు. రెండు సంవత్సరాల క్రితం నగరానికి వలస వచ్చి వీరు మల్లంపేటలోని శ్రీలక్ష్మీ విలాస్ అపార్ట్మెంట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. కాగా మంగళవారం అపార్ట్‌మెంట్‌లోని నీటి సంపులో నీళ్లు అయిపోవడంతో యాదయ్య సంపులోకి దిగి పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడి చనిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్నాం'


శ్రీహోమ్స్‌కాలనీలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి

నిజాంపేట్: డివిజన్ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని శ్రీహోమ్స్ కాలనీలోని ఆర్కె ప్రైడ్ అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో మౌలిక సదుపాయాలను కల్పించడానికి పెద్దపీట వేసి ముందుకు సాగుతున్నామన్నారు. స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. శ్రీ హోమ్స్ కాలనీ యూత్ అసోసియేషన్ సభ్యులు, ఏఎస్‌ఆర్ బృందావన్ కాలనీ సభ్యులు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో ఆటంకాలు తలెత్తనున్నాయని ప్రగతినగర్ సబ్‌స్టేషన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ డాక్టర్స్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిల్పా లేఅవుట్, డాలర్ హోమ్స్, ఎస్ఎఎస్ ఫంక్షన్‌హాలు ఏరియాలో, అదే విధంగా మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు చర్చి ఏరియా, మున్సిపల్ కార్యాలయం , జూడియో మాల్, తిరుమల ఫర్నిచర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కొంపల్లి సెక్షన్ పరిధిలో..

కుత్బుల్లాపూర్: విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రీకండక్టరింగ్ పనుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ గాయత్రినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గోదావరి హోమ్స్, గాయత్రినగర్, టీఆర్‌ఎస్ గార్డెన్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గ్రీన్‌బెల్టుల లక్ష్యం.. వ్యర్థం


గ్రీన్ బెల్ట్‌లో ఓ పరిశ్రమ యాజమాన్యం షెడ్డు వేసి గేటు ఏర్పాటు చేసిన దృశ్యం

రంగారెడ్డినగర్: పారిశ్రామికవాడల్లో పచ్చదనాన్ని పెంపొందించి కాలుష్యాన్ని తగ్గించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన గ్రీన్ బెల్ట్‌లను డంపింగ్ కేంద్రాలుగా మార్చేస్తున్నారు. కొందరైతే తమ సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. గాంధీనగర్ పారిశ్రామికవాడ ప్రాంతంలో ఐలా అధికారులు గ్రీన్ బెల్టులను నిర్మించారు. నాటిన మొక్కలకు నీళ్లు పోసి వాటిని పరిరక్షించాల్సిన బాధ్యతను సదరు పరిశ్రమల యాజమాన్యాలకు అప్పగించారు. అయితే పరిశ్రమల నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో డంపింగ్ కేంద్రాలుగా మారుతున్నాయి. ఇప్పటికైనా ఐలా అధికారులు స్పందించి గ్రీన్ బెల్ట్‌లను పునరుద్ధరించాలని పర్యావరణ వేత్తలు, స్థానికులు కోరుతున్నారు.


ఐడీపీఎల్ - జగద్గిరిగుట్ట రోడ్డును ఆనుకుని ఉన్న గ్రీన్ బెల్టులో వ్యర్థాలు

'సర్వే నం.170లో ప్రజాప్రతినిధులు కబ్జాలకు పాల్పడుతున్నారు'

రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు డా. ఎస్.మల్లారెడ్డి


ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి

నిజాంపేట్: అధికార పార్టీ ప్రజాప్రతినిధులు భూకబ్జాదారుల అవతారమెత్తి ప్రభుత్వ భూములను కాజేస్తున్నారని రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన బాచుపల్లి నుంచి మల్లంపేట వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. బాచుపల్లి- మల్లంపేట్ రోడ్డు గుంతలమయంగా మారిందన్నారు. రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సర్వే నం.170లో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

◆ కత్వా చెరువులో ఆక్రమణలను తొలగించి చెరువు స్థలాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, కేసీఆర్ మాయ మాటలు ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం చేశారు. బీజేపీ నాయకులు నర్సింగరావు, దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మురళిబాబు, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సారనవీన్, దుసకంటి శేఖర్, రాహుల్, పులి పవన్‌చారి తదితరులు ఉన్నారు.

మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళులు


సూరారం 60 గజాల్లో నివాళులర్పిస్తున్న విప్లవజ్యోతి అల్లూరి ఫౌండేషన్ సభ్యులు..

రంగారెడ్డినగర్: విప్లవ జ్యోతి, ఆంగ్లేయులను గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని నేతలు కొనియాడారు. అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలను మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామరాజు విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, రాజకీయా పార్టీల నాయకులు, సంక్షేమ సంఘాలు, ప్రజా సంఘాల సభ్యులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య సమరోద్యమంలో భాగంగా మన్యం ప్రాంతంలో గిరిజనులపై బ్రిటిషర్లు సాగించిన దౌర్జన్యాలను ఎదిరించారని అన్నారు. గెరిల్లా యుద్ధం ద్వారా రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యానికి చమటలు పట్టించిన ధీరోత్తముడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు.


ప్రగతినగర్‌లో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే వివేకానంద్


సాయిబాబానగర్‌లో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కూన శ్రీశైలంగౌడ్


కృషికాలనీలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కంది శ్రీరాములు

ఘనంగా హెలెన్ కెల్లర్ జయంతి


విద్యార్థులకు ప్రోత్సహక బహుమతులు అందజేస్తున్న జీడిమెట్ల డిపో సీఐ సునీత

సుభాష్‌నగర్: సూరారం కాలనీలోని లూయిస్ బ్రెయిలీ భవనంలో వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్ ఆధ్వర్యంలో మంగళవారం హెలెన్ కెల్లర్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీడిమెట్ల ఆర్టీసీ డీపో సీఐ సునీత, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు జావిద్, నార్త్ సిటీ హైస్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్వర్లుముదిరాజ్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఇటీవల ఎస్ఎస్‌సీ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్ స్థాపకుడు దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో జీడిమెట్ల డిపో సిఐ సునీత మీదుచేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు అంజయ్య, సత్యం, యాదయ్య యాదవ్, శేఖర్ గౌడ్ ,వెంకట్రామయ్య, నరేందర్ రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పెండింగ్ పనుల విషయమై మంగళవారం నిజాంపేట్ కౌన్సిల్ హాలులో మేయర్ నీలారెడ్డి అధ్యక్షతన అధికారులు, కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలను సత్వరమే పూర్తి చేయాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి చెత్తను తరలించాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో చేరిన వరదనీటిని మోటార్ల సహాయంతో తోడాలని, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని మేయర్ ఆదేశించారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలో కార్పొరేషన్ పరిధిలోని అమ్మవార్ల ఆలయాల్లో ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ నిధులు ఆయా ఆలయాల కమిటీలకు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఆగం పాండు ముదిరాజ్, చిట్ల దివాకర్, సురేష్ రెడ్డి, ఇంద్రజిత్ రెడ్డి, గాజుల సుజాత, బాలాజీ నాయక్, కో.ఆప్షన్ సభ్యుడు అభిషేక్ రెడ్డి, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం

లాలాపేట: తెలంగాణలోని యూనివర్సిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం అవుతున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాలలోని న్యూ సెమినార్ హాల్లో ఓయూ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

డిమాండ్ నోటీసులు అందుకున్నోళ్లకు అవకాశం 3రోజులే..

డబ్బులు చెల్లించి స్థలాలు క్రమబద్ధీకరించుకోండి: కుత్బుల్లాపూర్ తహసీల్దార్ సంజీవరావు



సుభాష్‌నగర్: జీఓ.59 కింద డిమాండ్ నోటీసులు అందుకున్న వారు వివిధ కారణాలతో డబ్బులు కట్టలేని వారికి మరో మూడు రోజులు అవకాశం ఇస్తున్నట్లు కుత్బుల్లాపూర్ తహసీల్దార్ సంజీవరావు అన్నారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ కొరకు ప్రభుత్వం 2022లో 59 జీవో కింద రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి అవకాశం ఇవ్వగా 14,518 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని పరిశీలించిన అనంతరం 4032 దరఖాస్తుదారులను అర్హులుగా గుర్తిస్తూ అప్పట్లో వారికి డిమాండ్ నోటీసులు అందజేశామన్నారు. ఆ ప్రాంతాలను బట్టి నిర్ణయించి ధరకు మూడు పర్యాయలుగా డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉండగా కేవలం 900 మంది మాత్రమే డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. వివిధ కారణాలవల్ల డబ్బులు కట్టలేని వారికి మరో 3 రోజులపాటు అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల వ్యవధిలో డబ్బులు కట్టని వారి స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని సూచించారు. ఈ అవకాశాన్ని తక్షణమే స్వద్వినియోగం చేసుకోవాలని కోరారు.